నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | HYDERABAD


## కుళ్లిన పండ్లు.. పాడైన సలాడ్



- అపరిశుభ్రమైన వాతావరణం, కుళ్లిన వాటితో ఫ్రూట్ జ్యూస్
- ఈగల మోత, బొద్దింక దాడి
- లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం
- అమీర్‌పేటలో పలు జ్యూస్ సెంటర్లలో 'ఫుడ్ సేఫ్టీ' తనిఖీ
- నిర్వాహకులకు నోటీసులు జారీ

IVలో



**జీతాలు చెల్లించండి..**

ఐదు నెలల జీతాలు చెల్లించాలంటూ..గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని గ్రామ పంచాయతీ కార్మికులు. – మేడ్చల్ కలెక్టరేట్



ఖాళీ బిందెలతో మహిళల నిరసన

## 3 రోజుల నుంచి మంచినీళ్లు లేవ్!

మేడ్చల్, ఏప్రిల్ 17: శామీర్‌పేట మండల పరిధిలోని లాల్‌గడీ మలక్‌పేటలో గురువారం నీటి ఎద్దడిని నిరసిస్తూ మహిళలు ఆందోళన నిర్వహించారు. పంచాయతీ కార్మికుల సమ్మె కారణంగా నీళ్లు వదలకపోవడంతో మూడు రోజుల నుంచి గ్రామంలో నీళ్లు రావడం లేదు. దీంతో మహిళలు ఖాళీ బిందెలతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిరసన తెలిపారు. అలాగే ఆలియాబాద్ గ్రామంలో కూడా నీళ్లు రాకపోవడంతో ప్రజలు ఆందోళనకు దిగారు. గ్రామస్తుడు కుంచె సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ప్రశ్నించగా, 'నేనేమీ చేయలేను, ఎంపీడీవోను అడగండి' అంటూ సమాధానం ఇచ్చారు. కార్మికులు సమ్మెలో ఉన్నందున ట్యాంకర్లతో నైనా నీళ్లు సరఫరా చేయవచ్చు కదా అని అడిగితే తమకు ఆ అధికారం ఉండదన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో సమస్య తీవ్రతరమయ్యే అవకాశం ఉందని, అప్పుడు పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్ వద్ద వినూత్నమైన రీతిలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కటౌట్ ఏర్పాటు చేయించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన కేటీఆర్, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో కలిసి కటౌట్ పరిశీలించారు. భవన్ ప్రాంగణంలో సైతం అందమైన అలంకరణ బాధ్యతలు చేసిన ఎమ్మెల్యే మాగంటిని కేటీఆర్ అభినందించారు.

*– బంజారాహిల్స్, ఏప్రిల్ 17*

# ఓరుగల్లుకు దండై కదులుదాం

## రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం | 27న చలో వరంగల్

- కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలి
- సన్నాహక సమావేశాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం
- 10 లక్షల మందితో ఎల్కతుర్తి సభ.. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్
- రాష్ట్రాన్ని బంగారుమయంగా మార్చిన కేసీఆర్.. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు
- మళ్లీ వచ్చేది కేసీఆర్‌రే.. ఎమ్మెల్యే మల్లారెడ్డి
- రేవంత్ సర్కారుపై ప్రజలకు నమ్మకం పోయింది.. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



జవహర్‌నగర్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి వాల్‌రైటింగ్

మేడ్చల్, ఏప్రిల్17(నమస్తే తెలంగాణ): రాష్ట్రమంతటా అతలాకుతలంగా ఉన్నదని, కరోనా ఉన్న సమయంలో కంటే కాంగ్రెస్ పాలన అధ్వానంగా ఉందని ఎమ్మెల్యే మల్లారెడ్డి విమర్శించారు. గురువారం జవహర్‌నగర్‌లో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ కరోనా వచ్చిన సమయంలో నైనా ఇంత అధ్వానంగా లేదని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ప్రజలు అన్ని రకాలుగా బాధలు పడుతున్నారన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్సే, మూడేండ్లు ఓపిక పట్టండి..మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ కావడం ఖాయం' అని అన్నారు. కాగా, జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలి రావాలంటూ.. ఆహ్వాన పత్రికలను అందజేశారు. జవహర్‌నగర్‌లో గోడలపై కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి, రజతోత్సవ సభ విజయవంతం కావాలి అంటూ ఎమ్మెల్యే మల్లారెడ్డి స్వయంగా వాల్ రైటింగ్ చేపట్టారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మైనార్టీలు మద్దతు ప్రకటించారు.



### గులాబీదే విజయం: ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, ఏప్రిల్ 17: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'చలో వరంగల్ సభ' సన్నాహక సమావేశానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో రాష్ట్రాన్ని బంగారుమయంగా మార్చారన్నారు. 'స్వల్ప ఓటు శాతంతో మనం అధికారాన్ని కోల్పోయినా.. అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ 16 నెలల్లో ప్రజలకు చేసింది ఏమీలేదు' అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో ప్రజలు ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అంతకముందు తెలంగాణ తల్లి విగ్రహానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పూలమాలలు వేశారు.



### శ్రేణులు సన్నద్ధం కావాలి: ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, ఏప్రిల్ 17 : ఎల్కతుర్తి లో జరిగే రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశం గురువారం సీ తాఫల్ మండి లో జరిగింది. పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. 27న ఉదయం 10.00 గంటలకు అన్ని డివిజన్లలో తోరణాలు, జెండాలతో అత్యంత సుందరంగా అలంకరణ చేసి జెండాలను ఆవిష్కరించాలని కోరారు. ఎల్కతుర్తిలో జరిగే పార్టీ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. 10 లక్షల మందితో ఎల్కతుర్తి సభను బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం నిర్వహిస్తోందని, సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కూడా భారీగా కార్యకర్తలు, జనం తరలి వెళ్లాలన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలన్నారు. కార్పొరేటర్లు శైలజ, ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, హేమ, సునీత , నేతలు ఆలకుంట హరి తదితరులు పాల్గొన్నారు.

### దారులన్నీ వరంగల్ వైపే సాగాలి..:ఎమ్మెల్యే కాలేరు



గోల్నాక, ఏప్రిల్ 17: ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలి వచ్చేందుకు పార్టీ శ్రేణులు సంసిద్ధులు కావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. అంబర్ పేట గులాబీ దండు బలమెంతో చూపుతూ ..దారులన్నీ ఎల్కతుర్తి వైపే సాగాలన్నారు. గురువారం అంబర్ పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ అధ్యక్షత చెన్నారెడ్డి నగర్ ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్లో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశం జరిగింది. స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ హాజరై మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని, కాంగ్రెస్ పాలనను చూసి తాము మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనసాగించిన అనేక పథకాలు తమకు అందడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు అందడం లేదని, తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

# ప్రచారం దండి.. ఖజానాకు గండి

- దారి తప్పుతున్న బల్దియా ప్రకటన విభాగం
- ప్రభుత్వంలోని పెద్దల సహకారంతో రెచ్చిపోతున్న కొన్ని ఏజెన్సీలు
- ఏడాదిలో రూ. 27కోట్లకు పైగా తగ్గిన ఆదాయం

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీకి ప్రధాన ఆదాయ వనరుల్లో ప్రకటన విభాగం ముఖ్యమైనది... అడ్వర్టయిజ్‌మెంట్ రూపంలో రూ.వంద కోట్ల మేర ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు ఉన్నప్పటికీ సరైన ఆదాయం ఎందుకు రావడం లేదు? ఖజానాకు చేరాల్సిన ఆదాయానికి గండి కొడుతున్న ఇంటి దొంగలేవరూ? అక్రమ హోర్డింగ్‌ల నియంత్రణలో ఎందుకీ నిర్లక్ష్యం? ఒకరిద్దరి ఏజెన్సీలకే ధారాదత్తం చేస్తున్నారా? ప్రకటన విభాగాన్ని ప్రక్షాళన ఎందుకు చేయడం లేదు? ప్రకటన విభాగంలో జరుగుతున్న అక్రమాల నిగ్గు తేల్చేందుకు ఏర్పాటు చేసిన హౌస్ కమిటీని నీరుగార్చింది ఎవరూ? ప్రభుత్వంలోని కొందరి పెద్దల సహకారంతో ఈ విభాగం నడుస్తుందా? ఇలా ప్రకటనల విభాగంపై వస్తున్న అనేక విమర్శలు జీహెచ్‌ఎంసీలో చర్చనీయాంశంగా మారాయి. ఇందుకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రకటనల రూపంలో రూ. 60కోట్ల మేర ఆదాయాన్ని సమకూర్చుకుంటే....గతేడాది 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.32.88కోట్లు మాత్రమే ఆదాయం రావడంతో ఈ చర్చకు దారితీసింది. ఆదాయం రూ.27కోట్లకు పైగా తగ్గడంలో కమిషనర్ దృష్టి సారించి విభాగాన్ని సమూల ప్రక్షాళన చేయాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యం**

జీహెచ్‌ఎంసీ ప్రకటన విభాగంలో అధికారుల నిర్లక్ష్యం, అవినీతి ఏ స్థాయిలో ఉందో కౌన్సిల్ వేదికగా కార్పొరేటర్లు మండిపడిన సంగతి తెలిసిందే. ప్రకటన విభాగంలో భారీగా అవినీతి జరుగుతున్నదని, జీహెచ్‌ఎంసీకి రావాల్సిన అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ కోట్లాది రూపాయలను కొందరు అధికారులు పక్కదారి పట్టిస్తున్నారని, అక్రమ హోర్డింగ్స్‌లు , మాల్స్‌లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసిన వారు 'కార్తిక్' ట్యాక్స్ చెల్లిస్తున్నారంటూ ఆరోపించారు. వందల కోట్లు రావాల్సిన చోట కేవలం రూ.20కోట్లు మాత్రమే వస్తుండడం పట్ల కార్పొరేటర్లు తీవ్రంగా తప్పుపట్టారు. ఈ తరుణంలోనే అక్రమాల నిగ్గు తేల్చేందుకు హౌస్ కమిటీని మేయర్ ఏర్పాటు చేశారు. ఒకటి, రెండు సార్లు హడావుడి చేసిన ఈ కమిటీ.. ప్రస్తుతం పత్తాలేకుండా పోయింది.

## స్పందించారు..

**బీజేపీ నేత అక్రమ నిర్మాణాలపై చర్యలు**

**భవనం పాక్షికంగా కూల్చివేత..సీజ్**

నమస్తే ఎఫెక్ట్

బంజారాహిల్స్, ఏప్రిల్ 17: రెవెన్యూ శాఖ నిబంధనలకు విరుద్ధంగా పేదలకు కేటాయించిన స్థలాలను అక్రమంగా కొనుగోలు చేయడంతో పాటు జీహెచ్‌ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా భారీ భవనాన్ని నిర్మిస్తున్న బీజేపీ నేత హెచ్. వెంకట్‌రెడ్డి వ్యవహారాన్ని 'నమస్తే తెలంగాణ' గురువారం 'అడుగడుగునా ఉల్లంఘనలే..' పేరుతో ప్రచురించిన కథనంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం.. వెంటనే చర్యలు తీసుకోవాలని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డిని ఆదేశించింది. దీంతో గురువారం రంగంలోకి దిగిన షేక్‌పేట మండల రెవెన్యూ సిబ్బంది ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మిస్తున్న భవనాన్ని పాక్షికంగా కూల్చేసి..సీజ్ చేశారు. ఇదిలా ఉండగా అక్రమంగా పట్టాలు కొనుగోలు చేయడంతో వెంకట్‌రెడ్డికి చెందిన అక్రమ నిర్మాణాన్ని కూల్చేందుకు వచ్చిన రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తమకు కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ దబాయించారు. కోర్టు ఆదేశాలను పరిశీలించగా అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలను కూల్చేందుకు జీహెచ్‌ఎంసీ ఇచ్చిన స్పీకింగ్ ఆర్డర్స్‌ను కొన్నాళ్లపాటు నిలిపివేయాలంటూ మాత్రమే ఉందని, ఆ ఉత్తర్వులలో రెవెన్యూశాఖకు ఎలాంటి ఆదేశాలు లేవని తేలడంతో కూల్చివేతలు పూర్తిచేశారు.

# మెట్రో ప్రయాణం భారం?



**టికెట్ ధరల పెంపుపై ఎల్ అండ్ టీ కసరత్తు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 ( నమస్తే తెలంగాణ ) : ఇకపై హైదరాబాద్ మెట్రో ప్రయాణం భారం కానున్నది. టికెట్ ధరలు పెంచడానికి ఎల్‌అండ్‌టీ సిద్ధమైంది. ఇప్పటికే టికెట్ కనిష్ఠ ధర రూ.10 గరిష్ఠ ధర రూ.60 ఉండగా అదనంగా ధరలు పెంచడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. టికెట్ ధరలు పెంపునకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు సమాచారం. రోజుకు 5.10 లక్షల మంది ప్రయాణాలు చేస్తున్నప్పటికీ నష్టాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. అందులో భాగంగా ఎల్‌అండ్‌టీ అధికారులు టికెట్ ధరల పెంపుపై చర్చిస్తున్నారు. ఎంత పెంచాలి? ఒకేసారి పెంచాలా లేదా విడతల వారీగా పెంచాలా? తదితర వాటిపై విస్తృతంగా చర్చిస్తున్నారు. ఇప్పటికే రూ.59 హాలిడే సేవర్ కార్డును ఎత్తివేసిన విషయం తెలిసిందే. దీంతో పాటు మెట్రో కార్డుపై రద్దీవేళల్లో 10 శాతం రాయితీని సైతం విరమించుకున్నారు. ఇప్పటికే ప్రయాణికులు ప్రస్తుతం ఉన్న టికెట్ ధరలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయితీలు ఎత్తేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి క్రమంలో మెట్రో టికెట్ ధరలు పెంచితే ప్రయాణికులు ఎలా స్పందిస్తారో చూడాలి.

**చార్జీల పెంపునకు నో చెప్పిన కేసీఆర్ సర్కార్..**

కరోనా విపత్కర సమయాల్లో తీవ్రంగా నష్టపోయామని టికెట్ ధరలు పెంచడానికి అనుమతినివ్వాలని కేసీఆర్ ప్రభుత్వాన్ని 2022లో కోరిన విషయం తెలిసిందే. అందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి.. చార్జీలను సవరించాలని ప్రతిపాదించింది. కానీ ప్రయాణికులపై భారం మోపడం సరైనది కాదని.. అప్పటికీ కొవిడ్ ప్రభావం కొనసాగుతున్న దరమిలా కేసీఆర్.. మెట్రో అధికారుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోలేదు. కాగా, ప్రస్తుతం వరకు మెట్రో రైలు నష్టాలు రూ.6,500 కోట్లకు చేరాయని అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఆదాయ మార్గాలను మెరుగుపరచుకున్నా.. నష్టం కొనసాగుతుందని వివరించారు. అందులో భాగంగా మెట్రో ధరల పెంపుకు రంగం సిద్ధమైనట్టు అధికారులు చెబుతున్నారు.

### రాగల 36 గంటల్లో వర్షసూచన



సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 36 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గురువారం గరిష్ఠం 37.0, కనిష్ఠం 23.6డిగ్రీలు, గాలిలో తేమ 39 శాతంగా నమోదైనట్లు తెలిపారు.

### జీహెచ్‌ఎంసీలో నలుగురు మెడికల్ ఆఫీసర్లపై చర్యలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన నలుగురు మెడికల్ ఆఫీసర్లపై మెమో జారీ చేస్తూ కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు జారీ చేశారు. ఈ చలాన్ల జారీలో పనితీరు మెరుగ్గా లేని చార్మినార్, మలక్‌పేట, జూబ్లీహిల్స్, మెహిదీపట్నం సర్కిల్‌కు సంబంధించిన మెడికల్ ఆఫీసర్లకు మెమోలు జారీ చేశారు. మెడికల్ ఆఫీసర్లు ఇశ్రాత్ ఇక్బాల్, జ్యోతిబాయ్, శ్రీనివాస్, రవిలపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

### గ్రూప్- 1 అభ్యర్థుల ధర్నా

సిటీబ్యూరో, ఏప్రిల్ 17 ( నమస్తే తెలంగాణ ): ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో శుక్రవారం గ్రూప్ -1 అభ్యర్థుల ధర్నా జరగనున్నది. అభ్యర్థులు తమకు జరిగిన అన్యాయంపై గళం ఎత్తనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రూప్ -1 అభ్యర్థులు తరలి రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. గ్రూప్ -1 తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందంటూ..పేపర్ వాల్యూయేషన్ సరిగ్గా చేయలేదని, గ్రూప్-1 మెయిన్స్ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని ఇప్పటికే అభ్యర్థులు నిరసనలు, ర్యాలీలతో తమ డిమాండ్లను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.


